

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365




WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



శనివారం శనివారం 15-08-2026 సంపుటి: 02 సంచిక : 105 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Saturday 15-08-2026 Volume :02 Issue: 105 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani

Contact Number 9059328777




## సొమ్మొకడిది సోకొకడిది అన్నట్లు ఉంది

- రేషన్ కార్డులపై ఫోటోలు లేకుండా పంపిణీ చేయాలి
- లేదంటే ప్రధానమంత్రి ఫోటో కూడా పెట్టాలి
- రేషన్ బియ్యానికి ఎక్కువ డబ్బులు ఇస్తుంది కేంద్రమే
- ప్రజాసమస్యలు చర్చించకుండానే పార్లమెంట్ సమావేశాలు ముగిసాయి
- చర్చనడ్డుకొని ప్రతిపక్షాలు గొప్ప అవకాశాన్ని కోల్పోయాయి : ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్
బీజేపీ తెలంగాణ ఎంపీలుగా మేము కేంద్రమంత్రులను కలిసి అనేక సమస్యల మీద వినతులు అందించాం అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలోని జవాహర్ నగర్ డంప్ యార్డు, హైదరాబాద్ మెట్రో, నేషనల్ హైవేలు, ట్రిపుల్ ఆర్ ల నిర్మాణం వేగవంతం చేయాలని కోరామన్నారు. రైల్వే మంత్రిని కలిసి రైలుపట్టాల మీద ప్రమాదాలు జరగకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఆర్ఓబి, ఆర్ యు బి సంఖ్య

-మిగతా 2 లో



## వీ లవ్ ఇండియా

- శ్రీలంక నుంచి జపాన్ వరకు..
- 36 దేశాల్లో 45 శాతం సానుకూలత
- సర్వేలో 79 శాతంతో టాప్‌లో శ్రీలంక
- 7 శాతంతో చివరిస్థానంలో పాకిస్థాన్
- ప్యూ రీసెర్చ్ సెంటర్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ:
శ్రీలంక నుంచి జపాన్ వరకు ఏ దేశాలు భారత్ ను ఎక్కువగా ప్రేమిస్తున్నాయి? అనే శీర్షికతో ప్యూ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన వసంతకాలం 2026 గ్లోబల్ యాటిట్యూడ్స్ సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా భారత్ పట్ల అభిప్రాయాలు మిశ్రమంగా ఉన్నాయి. 36 దేశాల్లో సర్వే నిర్వహించగా సగటున 45 శాతం మంది అనుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. 41 శాతం మంది ప్రతికూలంగా చూస్తున్నారు. శ్రీలంకలో అత్యధిక అనుకూలత నమోదైంది. అక్కడ 79 శాతం మంది భారత్ పట్ల సానుకూల అభిప్రాయం కలిగి ఉన్నారు. ఇది సర్వేలో అత్యున్నత స్థానం. యునైటెడ్ కింగ్ డమ్, కెన్యాలో 71 శాతం మంది అనుకూలంగా చూస్తున్నారు. జర్మనీలో 63 శాతం, ఇజ్రాయెల్ లో 60 శాతం, ఇటలీలో 56 శాతం, స్వీడన్, జపాన్, థాయ్ లాండ్ లో 55 శాతం అనుకూల అభిప్రాయం వ్యక్తమైంది. కెనడా, సింగపూర్ లలో 51 శాతం, ఫ్రాన్స్, ఇండోనేషియాలో 50 శాతం అనుకూలంగా ఉన్నారు. అమెరికాలో 45 శాతం అనుకూలంగా చూస్తున్నారు. బంగ్లాదేశ్ లో 42 శాతం మాత్రమే అనుకూలం. పాకిస్థాన్ లో అత్యల్పం నమోదైంది. అక్కడ కేవలం 7 శాతం మంది మాత్రమే అనుకూల అభిప్రాయం కలిగి ఉన్నారు. 91 శాతం మంది ప్రతికూలంగా చూస్తున్నారు.

## పూలే ఆశయాలు కొనసాగిస్తాం

### బీసీ జనగణన చేయడానికి దేశంలో ఎవరూ ధైర్యం చేయలేదు

- బ్రిటీష్ వాళ్ల తర్వాత ఎవరూ బీసీ జనగణన చేయలేదు
- కాని మేము బీసీ జనగణన చేసి బీసీల లెక్క తేల్చాం
- యేడాదిలో బీసీ జనగణనను పూర్తి చేశాం
- పారదర్శకంగా ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తాం
- నాణ్యమైన విద్యను, పౌష్టికాహారాన్ని అందించే బాధ్యత నాది : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఆగస్టు 14 (నేటి దర్శిని)
150 ఏళ్ల క్రితం మహాత్మ జ్యోతిబాపూలే అనగారిన వర్గాల కోసం కృషి చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహాత్మ జ్యోతి బా పూలే డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను దేశంలో ఎక్కడకిపోయినా చూస్తుంటాం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నగరంలో మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వైపు అంబేడ్కర్, మరో వైపు ఇందిరా

-మిగతా 2 లో





## ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలి

- కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే చెప్పా
- రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటా
- కాంగ్రెస్‌ను విమర్శించలేదు
- కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి క్లారిటీ

హైదరాబాద్ ఆగస్టు 14 (నేటి దర్శిని)
కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిన్న చేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణచివేస్తున్నారనే విషయాన్ని తాను

-మిగతా 2 లో



## ఎర్రకోట ముస్తాబు

- వందేమాతరంతో కొత్త శకం
- పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం
- ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు
- బస్తర్‌లోని 92 గ్రామాల్లో వేడుకలు
- ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం.. హైఅలర్ట్

02

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశం సర్వం సిద్ధమైంది. ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. 150 ఏళ్ల 'వందేమాతరం'కు ప్రత్యేక గౌరవం, యువశక్తికి పెద్దపీట, మారుమూల గ్రామాల్లో తొలిసారి త్రివర్ణ పతాక ఆవిష్కరణ వంటి విశేషాలతో ఈసారి వేడుకలు మరింత ప్రత్యేకత సంతరించుకున్నాయి.

## గ్లోబల్ సమ్మిట్ 2.0

### డిసెంబర్ 7,8,9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో..

- ఉప ముఖ్యమంత్రి భట్టి నేతృత్వంలో ఉపసంఘం..
- హిల్ట్ పాలసీ దరఖాస్తు గడువు పొడిగింపు
- ప్రభుత్వ, వివాదాల్లేని భూ సమస్యలు పరిష్కరిస్తాం..
- క్యూర్ పరిధిలో ఎలక్ట్రిక్ వాహనాలుగా ఆటోలు
- 7 రకాల సన్నాలకే బోనస్..
- స్కిల్స్ వర్సిటీ పరిధిలోకి ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్‌లు..
- 7 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలు మంజూరు..
- నేడు సంగారెడ్డిలో ఘనంగా స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ
- మంత్రివర్గం నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ ఆగస్టు 14 (నేటి దర్శిని)
గతేడాది తరహాలోనే ఈ ఏడాది కూడా డిసెంబర్ ఏడు, ఎనిమిది, తొమ్మిది తేదీల్లో ఫ్యూచర్‌సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ సమ్మిట్ నిర్వహణ కోసం ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి సభ్యులుగా ఉన్నారు. గతేడాది తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించినట్టే ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో సదస్సు నిర్వహణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానంగా రాష్ట్రంలో రక్షణ, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ సదస్సు

-మిగతా 2 లో






## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, హైకోర్ట్, ఎర్రకోటకు బాంబు బెదిరింపు

- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ భద్రతా వ్యవస్థ అప్రమత్తం
- ఆగస్టు 15న పేలుళ్లకు పాల్పడతామంటూ ఈమెయిల్‌లో హెచ్చరికలు
- ఖలిస్తాన్ పేరుతో బెదిరింపులు.. హైకోర్టును టార్గెట్ చేసినట్లు ప్రకటన
- కీలక ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు, ఎంట్రీ-ఎగ్జిట్ మార్గాలపై నిఘా
- ఎయిర్‌పోర్టులు, కోర్టులు, ప్రజా ప్రదేశాల్లో భద్రత మరింత కట్టుదిట్టం

న్యూఢిల్లి ఆగస్టు 14 (నేటి దర్శిని)
దేశం ఒకపక్క స్వాతంత్ర్య దిన వేడుకలకు సిద్ధమవుతుంటే.. మరోపక్క దేశ రాజధానికి మాత్రం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీలోని ఎయిర్‌పోర్టు, ఎర్రకోట, హైకోర్ట్ సహా కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇందుకు సంబంధించి శుక్రవారం అధికారులకు ఒక ఈమెయిల్ వచ్చింది. దీనిలో ఢిల్లీలోని కోర్టులు, రైళ్లలో పేలుళ్లకు పాల్పడతామని హెచ్చరించారు. ఆగష్టు 15న ఈ పేలుళ్లు జరుపుతామని

-మిగతా 2 లో

## నీటిని ఆపితే యుద్ధమే

- భారత్‌కు పాక్ ప్రధాని హెచ్చరిక
- ప్రతి బొట్టూ భారత్‌కు రెడ్ లైన్
- సింధూ జలాలపై పాక్ ప్రధాని ప్రగల్భాలు
- మా రక్షణకు ముప్పు వాటిల్లితే ఊరుకోం
- షెహబాజ్ షరీఫ్ కవ్వింపు వ్యాఖ్యలు




02

### ఆగష్టు చివరి వరకు విస్తారంగా

## వర్షాలు కురిసే అవకాశం

02



- బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాల ప్రభావం
- దేశ తూర్పు, పశ్చిమ, మధ్య ప్రాంతాల్లో వానల జోరు
- వచ్చే 15 రోజుల్లో గణనీయమైన వర్షపాతంపై అంచనాలు
- ఎల్‌నినో ప్రభావంతో కొనసాగుతున్న వర్షాభావ పరిస్థితులు
- వర్షపు లోటు తగ్గించే దిశగా అనుకూల వాతావరణం

### వికసిత్ భారత్ కోసం

## అందరూ పనిచేయాలి



- జాతినుద్దేశించి మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన జ్యోతిబా పూలే, సావిత్రిబాయి
- మహిళా సాధికారత కోసం పాటుపడ్డారని ప్రశంసలు గుప్పించిన ముర్ము

02

# ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలి

మొదటి తరువాయి


గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడవవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, హైకోర్ట్, ఎర్రకోటకు బాంబు బెదిరింపు

మొదటి తరువాయి

మెయిల్‌లో ఉంది. అందులోనూ ఢిల్లీ హైకోర్టును ఆగస్టు 15న మధ్యాహ్నం 2.11 గంటలకు పేల్చేస్తామని కూడా పేర్కొన్నారు.ఢిల్లీని ఖలిస్తాన్‌లో భాగంగా చేయాలనే లక్ష్యంతో ఈ పేలుళ్లు జరుపుతామని మెయిల్‌లో పేర్కొన్నారు. సిక్కులకు న్యాయం చేయడంలో ఢిల్లీ హైకోర్టు విఫలమైనట్లు, అందులోనూ 1984లో జరిగిన సిక్కు అల్లర్ల కేసులో బాధిత సిక్కులకు కోర్టు న్యాయం చేయలేకపోయిందని, అందుకే ఢిల్లీ హైకోర్టును టార్గెట్ చేశామని మెయిల్‌లో వివరించారు. ఢిల్లీలో ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3ని పేల్చేస్తామన్నారు. జామ్‌నగర్ హౌజ్, ఝుండేవాలన్ బిల్డింగ్ వంటివాటికి కూడా బాంబు ముప్పు ఉంది. ఈ బాంబు హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, భద్రతా బలగాలు హై అలర్ట్ ప్రకటించారు. బాంబు బెదిరింపులు ఉన్న ప్రదేశాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గట్టి నిఘా, బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంట్రీ, ఎగ్జిట్ రూట్లలో తనిఖీలు చేపడుతున్నారు. ఇతర పబ్లిక్ ప్లేసులలో కూడా తనిఖీలు చేపట్టారు. ఢిల్లీ హైకోర్టు, ఎయిర్‌పోర్టులలో భద్రతను మరింతకట్టుదిట్టం చేశారు. శనివారం, ఆగస్టు 15న ఢిల్లీలో స్వాతంత్ర్య దిన వేడుకలు జరగనున్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ వేడుకల కోసం ఢిల్లీ నగరంలోని ఎర్రకోట ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. వేడుకల కోసం మండి హౌజ్ మెట్రో స్టేషన్, ఐటీవో బిల్డింగులను అందంగా అలంకరించారు.


# నీటిని ఆపితే యుద్ధమే



ఇస్లామాబాద్:
నీరు మా రెడ్ లైన్ అని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారతదేశాన్ని మరోసారి హెచ్చరించారు. ఇస్లామాబాద్ లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ పాకిస్తాన్ నీటి ప్రతి చుక్కా మా రెడ్ లైన్ అని ప్రకటించారు. నీటిని ఆపితే యుద్ధమే అని అన్నారు. భారత్ సరైన మార్గానికి రాకపోతే నేరుగా ప్రతిస్పందన ఇస్తామని హెచ్చరించారు. 1960 నాటి సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసినందుకు ఆయన విమర్శించారు. గత సంవత్సరం యుద్ధంలో ఓటమి తర్వాత భారత్ ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా ఈ ఒప్పందాన్ని నిలిపివేసి శాంతికి శత్రువుగా నిరూపించుకుందని అన్నారు. పాకిస్తాన్ శాంతిని కోరుతుందని కానీ దాన్ని బలహీనతగా భావించకూడదని చెప్పారు. సార్వభౌమత్వం లేదా భద్రతపై సవాలు వచ్చినట్లయితే బలమైన ప్రతిస్పందన ఇస్తామని హెచ్చరించారు.

## వికసిత్ భారత్ కోసం అందరూ పనిచేయాలి

-జాతినుద్దేశించి మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
-బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన జ్యోతిబా పూలే, సావిత్రిబాయి
-మహిళా సాధికారత కోసం పాటుపడ్డారని ప్రశంసలు గుప్పించిన ముర్ము



న్యూఢిల్లీ:
రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్వాతంత్ర్య దినోత్సవ సంధ్య వేళ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో దేశ పురోగతి, జాతీయ భద్రత, సామాజిక న్యాయం మరియు భవిష్యత్తు లక్ష్యాలను ప్రతిబింబించేలా సాగింది. దేశప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రారంభమైన ఈ సందేశంలో భారతదేశం సాధిస్తున్న సాంకేతిక, ఆర్థిక, సామాజిక విజయాలను ప్రస్తావించడంతో పాటు, రాబోయే దశాబ్దాల్లో దేశం అనుసరించాల్సిన వ్యూహాత్మక దిశానిర్దేశాన్ని స్పష్టం చేశారు. భారతదేశం తన స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకునే 2047 నాటికి దేశాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన గమ్యస్థానంగా (వికసిత్ భారత్) మార్చడమే మన ప్రాథమిక డిజైన్ అని రాష్ట్రపతి స్పష్టం చేశారు. సమగ్ర భాగస్వామ్యం: ఈ లక్ష్య సాధన కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు, వ్యవస్థ, రంగాలు భాగస్వామ్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆర్థిక నిలకడ మరియు సాంకేతికత: డిజిటల్ విప్లవం, హరిత ఇంధనం, స్టార్టప్ సంస్కృతి మరియు తయారీ రంగం భారత్‌ను ప్రపంచంలో కీలక ఆర్థిక శక్తిగా నిలబెడుతున్నాయని పేర్కొన్నారు. పట్టణాల వేగవంతమైన పురోగతితో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే అందరికీ ఫలాలు అందే 'సమ్మేళన అభివృద్ధి' సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు.

# సొమ్మొకడిది సోకొకడిది అన్నట్లు ఉంది

మొదటి తరువాయి

పెంచాలని కోరాము. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు సాధ్యమైనన్ని ఎక్కువ నిర్మాణం చేయాలని కోరాము. దేశవ్యాప్తంగా కూడా ఈ సమస్య పరిష్కారం చేస్తామన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణం కోసం కేంద్రం డబ్బులు ఇస్తే కూడా కేసీఆర్ తీసుకోకుండా అహంకారపూరితంగా వ్యవహరించారు. రేవంత్ రెడ్డి డబ్బులు తీసుకున్నాడు కానీ ఇందిరమ్మ బొమ్మ మాత్రమే వేసుకుంటాడట అని అన్నారు. ఒక వైపు నిధులకోసం ఢిల్లీకి పోతున్నారు.. తెచ్చుకుంటున్నారు. కానీ కేంద్రం ఇస్తుంది అని మాత్రం బయటికి చెప్పడం లేదు అని అన్నారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ కింద దేశవ్యాప్తంగా బిపిఎల్ కింద ఉన్న ప్రజలకు రేషన్ బియ్యం అందిస్తుంది. - మన రాష్ట్రంలో 57 లక్షల రేషన్ కార్డులు.. 1 కోటి 91 లక్షల మందికి 9 లక్షల 55 వేల మెట్రిక్ టన్నులు బియ్యం ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున 49.4 లక్షల రేషన్ కార్డులకు 1 కోటి 50 లక్షల మందికి 9 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇస్తుందన్నారు. రాష్ట్రం కంటే కేంద్రం ఎక్కువ మందికి బియ్యం ఇస్తుంది. మోడీ ప్రభుత్వం బియ్యం ఉచితంగా ఇస్తుంటే.. కార్డులు మాత్రం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలు పెట్టి ఇస్తారట.. ఇదేం సంస్కారం. మీ తాత జాగీరా అని ప్రశ్నించారు. ఈ కార్డులు ఇవ్వడానికి ఆరు వందల కోట్లు ఖర్చు పెట్టారు. మీరు పోయి కొత్త ప్రభుత్వం వస్తే మళ్ళీ కార్డులు ఇస్తారా ? కార్డులు శాశ్వతంగా ఉంటాయి మీ ప్రభుత్వం కాదు అని ఆయన అన్నారు. ఇప్పుడు కార్డులు లేకపోయినా బియ్యం ఇస్తున్నారుగా.. ఎందుకు ఇంత ఖర్చు పెట్టడం మీ ఫోటోల కోసమా ? - భారత ప్రభుత్వ సహకారంతో, రాష్ట్ర ప్రభుత్వం సహాయంతో అని రాసి ఫోటోలు లేకుండా కార్డులు ఇవ్వండి అని డిమాండ్ చేశారు.

# ఎర్రకోట ముస్తాబు

**--వందేమాతరంతో కొత్త శకం**
**-పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం**
**-ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు**
**-బస్తర్‌లోని 92 గ్రామాల్లో వేడుకలు**
**-ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం.. హైఅలర్ట్**



దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటపై ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పలు ప్రత్యేకతలను సంతరించుకున్నాయి. ముఖ్యంగా 150 ఏళ్లు పూర్తి చేసుకున్న జాతీయ గీతం వందేమాతరం తొలిసారిగా ఎర్రకోట వేదికపై ఆలపించనుండటం ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. యువత శక్తిని ప్రతిబింబించేలా ఈ ఏడాది వేడుకలకు యువ శక్తే ప్రధాన ఇతివృత్తంగా నిర్ణయించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తొలిసారిగా ఎర్రకోట ప్రాంగణంలో వందేమాతరాన్ని ఆలపించనున్నారు. ప్రధాని మోదీ ఎర్రకోటకు చేరుకున్న అనంతరం జాతీయ గీతం వందేమాతరంతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనంతరం ప్రధాని జాతీయ జెండాను ఎగురవేసి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. స్వాతంత్ర్యోద్యమంలో కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చిన వందేమాతరానికి ఈ ఏడాది 150 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో దీనికి ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. భారత వ్యోమనిక దళానికి చెందిన ఎంబి-17 హెలికాప్టర్ 150 ఏళ్ల వందేమాతరం స్మారక బ్యానర్ను మోసుకెళ్లడంతో పాటు ఎర్రకోట వద్దకు చేరుకున్న ప్రజలపై పూలవర్షం కురిపించనుంది.

యువ శక్తికి పెద్దపీట

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో యువత పాత్రను ప్రధానంగా ప్రస్తావించనున్నారు. దేశ ప్రగతిలో యువశక్తి చేస్తున్న కృషిని ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహిస్తున్నారు. 2026 అంతర్జాతీయ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లలో పతకాలు సాధించిన 19 మంది విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. వీరిని ఎర్రకోట ప్రాకారంపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో కూర్చోబెట్టనున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ యువత సాధిస్తున్న విజయాలకు వీరి ప్రతిభను ప్రతీకగా చూపించనున్నారు.

'సేవా తీర్థ్' స్ఫూర్తితో ఆహ్వానాలు

ఈ ఏడాదీ స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సేవా తీర్థ్ ఇతివృత్తంతో ఆహ్వాన పత్రాలను రూపొందించారు. ప్రతి పౌరుడి సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయాలనే సందేశాన్ని ఇది అందిస్తోంది. ఆహ్వాన పత్రంలోని ధర్మచక్రం న్యాయబద్ధమైన కర్తవ్యాన్ని, నిరంతర నిస్వార్థ సేవను ప్రతిబింబించేలా రూపొందించారు. దేశం ముందు.. సేవా భావం, బాధ్యత, కర్తవ్యమే ప్రధానమనే సందేశాన్ని సేవా తీర్థద్వారా చాటుతున్నారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యాన్ని తెలియజేసేలా ఎర్రకోటలో ఈసారి ఏర్పాటు చేసిన సిట్టింగ్ ఎన్‌క్లోజర్లకు దేశంలోని ప్రముఖ సరస్సుల పేర్లు పెట్టారు. పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

నక్సల్ ప్రభావిత గ్రామాల్లో తొలిసారి త్రివర్ణ పతాకం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈసారి ఛత్తీస్‌గఢ్‌లోనూ ప్రత్యేకతను సంతరించుకోనున్నాయి. వామపక్ష తీవ్రవాదం నుంచి విముక్తి పొందిన ప్రాంతాల్లో తొలిసారిగా జాతీయ జెండా ఎగురవేయనున్నారు. మార్చి 31న ఛత్తీస్‌గఢ్‌ను వామపక్ష తీవ్రవాద రహిత రాష్ట్రంగా ప్రకటించిన నేపథ్యంలో ఈసారి తీర్థంగా యాత్రను గతంలో మావోయిస్టుల ప్రభావంలో ఉన్న మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లనున్నారు. బస్తర్ ప్రాంతంలోని 92 గ్రామాల్లో ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ఒకప్పుడు మావోయిస్టు కార్యకలాపాలకు కేంద్రబిందువుగా ఉన్న ప్రాంతాల్లోనే ఇప్పుడు త్రివర్ణ పతాకం రెపరెపలాడనుండటం దేశంలో మారుతున్న పరిస్థితులకు ప్రతీకగా నిలవనుంది. మారుమూల గ్రామాలు, పాఠశాలల్లోనూ 'తిరంగా యాత్ర' నిర్వహించి ప్రజలను స్వాతంత్ర్య వేడుకల్లో భాగస్వాములను చేయనున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీ అసెంబ్లీ ప్రాంగణాన్ని కూడా ప్రజల సందర్శనకు తెరవనున్నారు. ఆగస్టు 14, 15 తేదీల్లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలు అసెంబ్లీ ప్రాంగణాన్ని సందర్శించేందుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ భవనాన్ని త్రివర్ణ రంగుల ప్రత్యేక లైటింగ్‌తో అలంకరించనున్నారు. బీఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్ బృందాలు దేశభక్తి గీతాలను ఆలపించనుండగా, సాహిత్య కళా పరిషత్ కళాకారులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సందర్శకులకు ముందస్తు రిజిస్ట్రేషన్ అవసరం లేదు. అయితే భద్రతా తనిఖీల అనంతరం మాత్రమే ప్రవేశం కల్పిస్తారు. సందర్శకులు ఆధార్ వంటి చెల్లుబాటయ్యే గుర్తింపు పత్రాన్ని వెంట తీసుకురావాల్సి ఉంటుంది.

యువత నుంచి మారుమూల గ్రామాల వరకు..

ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కేవలం ఢిల్లీలోని ఎర్రకోటకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో జరగనున్నాయి. ఒకవైపు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విజయాలు సాధిస్తున్న యువతకు గుర్తింపు లభిస్తుండగా.. మరోవైపు గతంలో మావోయిస్టుల ప్రభావంలో ఉన్న బస్తర్ వంటి ప్రాంతాల్లో త్రివర్ణ పతాకం రెపరెప లాడనుంది. యువ శక్తి నుంచి సేవా తీర్థ్ వరకు.. వందేమాతరం నుంచి బస్తర్ గ్రామాల్లో త్రివర్ణ పతాకం వరకు.. ఈ ఏడాది 80వ స్వాతంత్ర్య దినోత్సవం దేశ ఐక్యత, యువత శక్తి, సేవా భావం, జాతీయ స్ఫూర్తికి ప్రతీకగా నిలవనుంది.

# గ్లోబల్ సమ్మిట్ 2.0

మొదటి తరువాయి

జరగనుంది. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు, వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించారు.

ఇందులో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. 22ఏ పరిధిలో కొన్ని వాస్తవమైన దరఖాస్తులున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ప్రభుత్వ, నిషేధిత జాబితాలో లేకుంటే, న్యాయస్థానాల్లో వివాదాల్లేని భూముల దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించామని అన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రభుత్వం కాదన్నారు. ఒక్క అంగుళం కూడా నష్టపోకుండా చూస్తామని చెప్పారు. క్యూర్ పరిధిలో ఉండే 46 మంది సబ్ రిజిస్ట్రార్లతో సమీక్ష చేశామనీ, 22ఏకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలిచ్చామని అన్నారు. ఏమైనా సమస్యలుంటే తన నెంబర్‌కు పంపాలనీ, వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మంత్రివర్గ నిర్ణయాలివే...

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో 2.81 కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. కొత్తగా కుటుంబీకుల పేర్లను కూడా నమోదు చేసింది. 62 లక్షల మందికి కొత్తగా లబ్ధి చేకూర్చింది. రాష్ట్రంలో 3.42 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులున్నారు. వారికి స్మార్ట్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాల్లోనూ ఇన్‌చార్జ్ మంత్రులు పంపిణీ చేస్తారు.

హిల్ట్ పాలసీ దరఖాస్తు గడువు అక్టోబర్ 31 వరకు పెంపు

హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను నగర శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో మూడు నెలలు రాష్ట్ర మంత్రివర్గం పొడిగించింది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

7 రకాల సన్నాలకే రూ.500 బోనస్

వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుందని వివరించింది. ఈ ఏడాది నుంచి ఆ ఏడు రకాల సన్నాలకే మద్దతుధరతోపాటు రూ.500 బోనస్ చెల్లించాలని తీర్మానించింది.

మిగులు ధాన్యం ఈ-వేలం

యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని మంత్రివర్గం తెలిపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసిందని పేర్కొంది. అందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరించింది. మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2,389 కనీస ధర నిర్ణయించి ఈ వేలం ద్వారా అమ్మాలని నిర్ణయించింది.

శక్తి శాఖ పరిధిలోకి స్కిల్స్ వర్సిటీ

రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తేవడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఉన్నాయి. వాటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వాటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించింది.


# పూలే ఆశయాలు కొనసాగిస్తాం

మొదటి తరువాయి

గాంధీ, మరో వైపు పీవీ నరసింహారావు, మరో వైపు జ్యోతి బాపూలే లివిగ్రహాలను ఇక్కడ ఆవిష్కరించుకున్నాం అని అన్నారు..లి వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలి, సక్సెస్ రోడ్డు చౌరస్తా ఇప్పుడు అద్భుతమైన చౌరస్తా గా మారిందన్నారు. రాజ్యాంగాన్ని ఓటు హక్కు ఇచ్చిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఇక్కడ ఆవిష్కరించబడింది. 150 యేళ్ల క్రితం జ్యోతి బా పూలే చదువు ఒక్కటే మార్గమని తన చదువుకోవడమే కాకుండా తన సతీమణిని చదివించడం ద్వారా ఆదర్శంగా నిలబడ్డారు అని గుర్తు చేశారు. మా ప్రభుత్వంలో లిజ్యోతి బా పూలే ఆలోచనలను కొనసాగిస్తున్నాం.. చదువులు ఒక్కటే ఆత్మగౌరవాన్ని గుర్తింపును ఇస్తుంది. తలెత్తుకునేలా చేస్తుందన్నారు. కుల నిర్మూలన జరగాలంటే, సామాజిక చైతన్యం కావాలంటే అందరు కలిసి కట్టుగా చదువుకోవడం, జీవించడం ద్వారా సాధ్యం అవుతుందన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తీసుకు వస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నాం. నర్సరీ నుంచి బ్రేక్ ఫాస్ట్ తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం అని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 2400 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్ ను అడ్వాన్స్ గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తున్నాం. పారదర్శకంగా ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తాం అని హామీ ఇచ్చారు. ప్రతియేడాది 2300 వేల కోట్ల రూపాయలను విద్యార్థుల ఖాతాల్లోకి ఫీజు రీయింబర్స్ మెంట్ వేస్తాం అని అన్నారు. 250 కోట్లు అడ్వాన్స్ గా పెట్టాం. ఆన్ లైన్ లో అప్లై చేసుకుంటే నెలలో ఫీజు రీయింబర్స్ మెంట్ విద్యార్థుల ఖాతాల్లో పడుతుంది. ఫీజులు కట్టలేదని సర్టిఫికెట్లు ఇవ్వమని ఏ కాలేజీ చెప్పకుండా ముందుగానే ఫీజులు చెల్లిస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ సర్టిఫికెట్, డాక్టర్ సర్టిఫికెట్ లో ఉంటే.. ఇప్పుడు సర్టిఫికెట్ ఉంటే సరిపోదు. నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు విద్యార్థులకు విద్య తో పాటు స్కిల్స్ నేర్పిస్తున్నాం అని అన్నారు.

# ఆగష్టు చివరి వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం

న్యూఢిల్లీ:
ప్రస్తుతం దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు కనిపిస్తోంది. అయితే, వానాకాలంలో భారీ వర్షాలు నమోదయ్యేది ఆగష్టులోనే. అందుకే ఈ నెలలో కూడా దేశంలో భారీ వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనావేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాతావరణం వర్షాలకు అనుకూలంగా ఉందని యురోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌క్యాస్ట్స్ (ఈసీఎండబ్ల్యూఎఫ్) సంస్థ ప్రకటించింది. ఈ సంస్థ అంచనా ప్రకారం వచ్చే 15 రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో తగినంత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.ముఖ్యంగా సెంట్రల్ ఇండియాతోపాటు దేశంలోని తూర్పు, పశ్చిమ



ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. బంగాళాఖాతాన్ని ఈ సీజన్ రెయిన్ ఫ్యాక్టరీ అంటారు. ఈ కాలంలో వర్షాలకు కారణమయ్యేది ఇదే. దీనికి అనుగుణంగా ప్రస్తుతం అనేక అల్పపీడన వ్యవస్థలు బంగాళాఖాతంలో భారీ సంఖ్యలో, ఒకదాని తర్వాత ఒకటి ఏర్పడుతున్నాయి. వీటివల్లే దేశంలో వర్షాలకు ఛాన్స్ ఉంది. ఈ అల్పపీడన వ్యవస్థలు మెల్లిగా దేశంలోకి కదులుతాయి. వీటివల్ల ఇప్పటికే ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌తోపాటు ఈశాన్య భారతదేశంలో తేమ శాతం పెరిగింది. ఈ కారణంగా ఆగష్టు చివరివారం వరకు వర్షాలకు ఛాన్స్ ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో కారణంగా దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అనేక చోట్ల కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. అందువల్ల బంగాళాఖాతంలో ఏర్పడ్డ వ్యవస్థల వల్ల వర్షాలు కురిస్తే, పరిస్థితుల్లో మార్పు రావొచ్చు. వర్షపు లోటు తగ్గవచ్చు.

WWW.NETIDARSHINI.COM RNI NO: TGTEL/25/A0471 తెలుగు దిన పత్రిక

# లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**● తలకొండపల్లిలో రక్తదాన శిబిరానికి విశేష స్పందన**





**తలకొండపల్లి. ఆగస్టు 14, ( నేటి దర్శిని):** తలకొండపల్లిలోని శతాబ్ది సిల్వర్ స్ప్రింగ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. లయన్ కాసు శ్రీనివాస్ రెడ్డి గారి మాతృమూర్తి శ్రీమతి కాసు సీతమ్మ గారి జ్ఞాపకార్థం లయన్ అంజి రెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో లయన్స్ సభ్యులు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేలా చేయడం లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం మానవతా సేవకు ప్రతీకగా నిలిచింది. కార్యక్రమం విజయవంతానికి లయన్ అంజి రెడ్డి సమన్వయంతో కృషి చేశారు.

ఈ సందర్భంగా లయన్ అంజి రెడ్డి మాట్లాడుతూ, "రక్తదానం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం లభించడం కంటే గొప్ప సేవ మరొకటి లేదు. ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు.

**లయన్స్ సేవలు అభినందనీయం: ఎంపీ మల్లు రవి**

నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ, "రక్తదానం అత్యంత విలువైన మానవతా సేవ. ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడగలదు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో నిరంతరం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమైనవి. ప్రజా సేవలో లయన్స్ క్లబ్ చేస్తున్న కృషి ప్రశంసనీయం" అని అన్నారు.

**ప్రజాసేవలో లయన్స్ క్లబ్ ముందంజ: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, "ప్రజలకు అవసరమైన సమయంలో ముందుకు వచ్చి సేవ చేయడం లయన్స్ క్లబ్ ప్రత్యేకత. రక్తదాన శిబిరాలతో పాటు వివిధ వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న లయన్స్ సభ్యుల కృషి అభినందనీయం" అని పేర్కొన్నారు.

శ్రీమతి కాసు సీతమ్మ గారి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం ద్వారా ఆమె స్మృతిని సేవా కార్యక్రమంతో కొనసాగించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

ఈ రక్తదాన శిబిరంలో 40 మంది రక్తదానం చేసినట్లు పి ఆర్ ఓ లయన్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ జంగయ్య, కొత్తపేట డిసిసిబి చైర్మన్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరి సాగు వద్దు.. ఆరుతడి పంటలే ముద్దు

**● నీటి లభ్యత లేకుండా వరి వేస్తే తీవ్ర నష్టం.. రైతులకు కలెక్టర్ చంద్రశేఖర్ సూచన**

**● సెప్టెంబర్ చివరి వరకు ఆరుతడి పంటలకు అవకాశం**

**● చౌడు భూముల్లో మినుము, పెసరతో పాటు ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలి**





**తిప్పర్తి, ఆగస్టు 14 (నేటి దర్శిని):** వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు వరి సాగు చేసి పెట్టుబడులు నష్టపోవద్దని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. ప్రస్తుతం జిల్లాలో వరి సాగుకు అవసరమైన నీటి వనరులు అనుకూలంగా లేవని, నీటి లభ్యత లేకుండా వరి సాగు చేస్తే పంట మధ్యలోనే ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. వరికి ప్రత్యామ్నాయంగా మినుము, పెసర వంటి ఆరుతడి పంటలతో పాటు ఉద్యాన పంటలను సాగు చేయాలని సూచించారు.

**క్షేత్రస్థాయిలో రైతులతో కలెక్టర్ భేటీ**

వరి సాగు పరిస్థితులను తెలుసుకునేందుకు కలెక్టర్ చంద్రశేఖర్ గురువారం తిప్పర్తి మండల కేంద్రం శివారులో పర్యటించారు. వరి సాగుకు భూములను సిద్ధం చేస్తున్న రైతులు మోహన్, పరశురాం, ఖాదర్ తదితరులతో నేరుగా మాట్లాడి నీటి వనరుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సాగునీటి వసతి లేకపోయినా వరి సాగుకు సిద్ధమవుతున్న రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వరి సాగుకు అవసరమైన పెట్టుబడి, నీటి లభ్యత, వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, కూలీల ఖర్చు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పంట ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీరు అందుబాటులో లేకపోతే పంట మధ్యలోనే ఎండిపోయి పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు.

**ఆరుతడి పంటల వైపు మళ్లాలి**

ప్రస్తుత వాతావరణ, నీటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు మినుము, పెసర వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వీటికి వరితో పోలిస్తే పెట్టుబడి తక్కువగా ఉండటంతో పాటు నీటి అవసరం కూడా తక్కువగా ఉంటుందని తెలిపారు. చౌడు భూముల్లో కూడా వరికి బదులుగా మినుము, పెసర వంటి పంటలను సాగు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. భూమి స్వభావాన్ని బట్టి జిప్సం వినియోగించడం ద్వారా చౌడు భూములను పంటల సాగుకు అనుకూలంగా మార్చుకోవచ్చని తెలిపారు.

**ఉద్యాన పంటలపై దృష్టి**

నీటి లభ్యతను బట్టి రేగు, కూరగాయలు తదితర ఉద్యాన పంటలను కూడా సాగు చేసుకునే అవకాశాలను రైతులు పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.

**సెప్టెంబర్ వరకు అవకాశం**

సెప్టెంబర్ చివరి వరకు ఆరుతడి పంటలు సాగు చేసుకునే అవకాశం ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి రైతును వ్యక్తిగతంగా కలిసి పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లోని ఏవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు పరిస్థితులను వివరించాలని సూచించారు.

**యూరియా అందుబాటులో ఉంచాలి**

ఈ సందర్భంగా రైతులు యూరియా లభ్యత సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. యాప్ ద్వారా యూరియా బుక్ చేస్తున్నప్పటికీ స్టాక్ త్వరగా అయిపోతోందని, అన్ని ఎరువుల దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్‌కు అవసరమైన యూరియా ఇండెంట్ పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు విజయేందర్ రెడ్డి, సన్నీ రాజ్, గిరిరాజు, ఏవో శ్రీనివాస్, ఏఈవో సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# పండగ సాయన్న జయంతికి అధికారిక వేడుకలకు గ్రీన్ సిగ్నల్

**● అక్టోబర్ 22న రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూల స్పందన**

**● ముఖ్యమంత్రికి నీలం మధు ముదిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు**



**పటాన్ చెరు, ఆగస్టు 15(నేటి దర్శిని):** తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన బహుజన వీరుడు పండగ సాయన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రతి ఏటా అక్టోబర్ 22న పండగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు నాయకులు తెలిపారు. ఈ మేరకు మంత్రి వాకిటి శ్రీహరి, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్, మాజీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ తదితరులు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నిజాం నిరంకుశత్వం, భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పండగ సాయన్న సాగించిన పోరాటం, పేదల పక్షాన ఆయన చేసిన సేవలను నాయకులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన పండగ సాయన్న చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, పండగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు త్వరలోనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నిర్ణయంపై నీలం మధు ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. ముదిరాజ్ సామాజికవర్గం సుదీర్ఘకాలంగా కోరుతున్న ఆకాంక్షకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం సంతోషకరమన్నారు. పండగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ పాల్గొన్నారు. అనంతరం ఆదిలాబాద్ పర్యటన నిమిత్తం ఆయన త్వరగా బయలుదేరి వెళ్లారు. చొప్పరి శంకర్, మహబూబ్‌నగర్ డీసీసీ సంజీవ్, ఖైరతాబాద్ డీసీసీ మోత రోహిత్, గుండ్లపల్లి శ్రీనివాస్, పిట్ల నగేష్, మద్దెల సంతోష్, మహేష్ సుంకరబోయిన, సాయన్న సేవా సమితి ప్రతినిధులు, ముదిరాజ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విఠాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**● ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి పాండు, కౌన్సిలర్ కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి**




**ఆమనగల్లు, ఆగస్టు14 (నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డ్ విఠాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం మెప్మా ద్వారా ఉచితంగా సరఫరా చేస్తున్న ఏకరూప దుస్తులు,షూస్,బెల్టు లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కౌన్సిలర్ కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి పాండు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, కన్న తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు అందించే సౌకర్యాలను, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, గ్రామంలోని చదువుకునే చిన్నారులను ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్, టై, బెల్ట్, షూ, పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ






**తలకొండపల్లి, ఆగస్టు 14, (నేటి దర్శిని):** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వము నుండి వచ్చిన యూనిఫామ్,టై, బెల్ట్, షూ, విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నసీమా సుల్తానాతో కలిసి అందజేసిన గ్రామ సర్పంచ్ వాన రాశి రాములమ్మ, ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మి ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద కుటుంబలకు చెందిన విద్యార్థిని ,విద్యార్థులు చదువుకుంటున్నారు.వారికి నాణ్యమైన విద్యను అందిస్తూ, నాణ్యమైన దుస్తులు అందించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల బలోపేతం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుంది అని అన్నారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సి వెంకట్ రెడ్డి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్పి కోఆప్షన్ సభ్యులు ముజీబూర్ రహమాన్, మాజీ ఉప సర్పంచ్ అజీజ్ వార్డు సభ్యులు విశేఖర్ నాయకులు ఏ .వెంకట్ రెడ్డి , ఎస్.విజయ్ కుమార్, ఆరిఫ్, వి.వెంకటేష్, సి. హ్,విష్ణువర్ధన్ యాదవ్, వద్దే రాజు, దుబ్బ గణేష్, ఉపాధ్యా యులు, , ఏపీఎం రామస్వామి , సీసీ శ్రీశైలం, మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్య,బుక్ కిపర్లు, మరియు గ్రామస్తులు, పాల్గొన్నారు

# రామ్నుంతల రైతు వేదికలో 'ఆత్మా' ద్వారా రైతు అవగాహన సదస్సు




**ఆమనగల్లు,ఆగస్టు14(నేటి దర్శిని);** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల పరిధిలోని రామ్నుంతల గ్రామ పంచాయతీ రైతు వేదికలో శుక్రవారం ఆత్మా పథకంలో సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న రైతు ముర్తుజపల్లి గ్రామ రైతు సాయి రెడ్డి సేంద్రీయ వ్యవసాయం ఆవశ్యకత,రసాయన మందులు లేకుండా జీవామృతం, ఘనజీవామృతం వంటి కషాయాలు వాడి నాణ్యమైన దిగుబడి పొందవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, రామ్నుంతల గ్రామ సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్ మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయంకు మక్కువ చూపాలని,రైతులకు సూచించారు. రసాయనక ఎరువులను వాడకుండా పంటలు పండించాలని,ఆధునిక సాగు మెలకువలు,ప్రభుత్వ పథకాలు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించే మార్గాలపై రైతులకు సర్పంచ్ శ్రీను నాయక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్,ఏఈఓ మీనాక్షి,ఉప సర్పంచ్ రాజేశ్వరి మోహన్,ఎఫ్ఎ లాలు,గ్రామ నాయకులు రూప్ సింగ్ నాయక్,నరేందర్,సత్తయ్య, యాదయ్య,గ్రామ యువకులు మహేష్,శాంతి లాల్,గ్రామ రైతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 2027 జనాభా లెక్కల్లో 40 ప్రశ్నలు..

**కులం, ఎస్సీ, ఎస్టీ హోదా, ఆధార్, బ్యాంక్ డిటేల్స్ సేకరణ**




**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (నేటి దర్శిని)**
జనాభా లెక్కల సేకరణకు చెందిన ప్రశ్నావళిని కేంద్ర హోంశాఖ రిలీజ్ చేసింది. 2027 జనాభా లెక్కల(జవఅంబం 2027) సేకరణలో భాగంగా 40 ప్రశ్నలు అడగనున్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ నోటీఫికేషన్ జారీ చేశారు. 1948 జనాభా లెక్కల చట్టం కింద ఆ నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. ఇంటింటి సర్వేలో సమాచార సేకరణ కోసం మొత్తం 40 ప్రశ్నలు వేస్తారు. భౌగోళిక, సామాజిక, విద్యా, ఆర్థిక అంశాల వివరాలను ప్రశ్నావళిలో అడగనున్నారు. వ్యక్తి పేరు, ఇంటి యాజమానితో రిలేషన్, లింగం, పుట్టిన తేది, వయసు, మ్యారేజ్ స్టేట్, జీవిత భాగస్వామి పేరు, నేషనాలిటీ లాంటి సమాచారాన్ని సేకరించనున్నారు. ఇక మతపరమైన అంశాల్లో షెడ్యూల్ కులమా లేక షెడ్యూల్ తెగకు చెందిన వారా అని తెలుసుకోనున్నారు. కులం, తల్లితండ్రులు, వైకల్యం, మాతృభాషతో పాటు ఇతర అంశాలను సేకరిస్తారు. అక్షరాస్యత, డిజిటిల్ లిటిరసీ స్టేటస్ కూడా తెలుసుకుంటారు. కోవిడ్19 టీకా తీసుకున్నారా, ఎన్ని బ్యాంకు అకౌంట్లు ఉన్నాయి, డాక్యుమెంట్ల వివరాలు, మొబైల్ నెంబర్, ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు వివరాలు కూడా సేకరించనున్నారు. లడాక్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో సెప్టెంబర్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు జనాభా లెక్కల సమాచారాన్ని సేకరించనున్నారు. దేశంలోని మిగితా ప్రాంతాల్లో వచ్చే ఏడాది జనాభా లెక్కల సేకరణ జరగనున్నది. జనాభా లెక్కల్లో భాగంగా తొలిసారి కులం వివరాలను సేకరించనున్నారు. గత ఏడాది ఏప్రిల్ 30వ తేదీన ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ కమిటీ భేటీలో కుల వివరాల సేకరణ కూడా చేపట్టాలని నిర్ణయించారు. యావత్ జనాభా లెక్కల ప్రక్రియ మొత్తం డిజిటల్ విధానంలో జరగనున్నది. తొలి దశలో భాగంగా ఇప్పటి హౌజ్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ ప్రక్రియ జరుగుతున్నది. సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఆ సమాచారాన్ని సేకరిస్తారు. ఏప్రిల్ 16వ తేదీన ఈ ప్రక్రియ మొదలైంది. దేశవ్యాప్తంగా ఉన్న కట్టడాలు, ఇండ్లు, ఇంటి నిర్మాణాల సమాచారాన్ని ఎన్యుమరేటర్లు సేకరిస్తున్న విషయం తెలిసిందే. జనాభా లెక్కల నిర్వహణ కోసం కేంద్రం సుమారు 11 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.

# పండ్లు, కూరగాయల్లో పురుగుమందుల కలకలం..

**తెలంగాణలో 486 నమూనాల్లో పరిమితికి మించి అవశేషాలు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (నేటి దర్శిని)**
పండ్లు, కూరగాయల్లో పురుగుమందుల అవశేషాలపై కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో తెలంగాణలో 486 నమూనాల్లో నిర్దేశిత గరిష్ఠ అవశేష పరిమితి (ఎంఆర్ఎల్)కి మించి అవశేషాలు ఉన్నట్లు తేలింది. 2023–26 మధ్య దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 70,652 పండ్లు, కూరగాయల నమూనాలను పరీక్షించగా.. 2,223 (3.1 శాతం) నమూనాల్లో భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిర్దేశించిన ఎంఆర్ఎల్ కంటే అధికంగా పురుగుమందుల అవశేషాలు గుర్తించినట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మంగళవారం రాతపూర్వకంగా లోక్‌సభలో వెల్లడించారు.

**తెలంగాణలో 8,198 నమూనాల పరీక్ష**
కేంద్ర వ్యవసాయశాఖ అమలు చేస్తున్న 'మానిటరింగ్ ఆఫ్ పెస్టిసైడ్ రెసిడ్యూస్ ఎట్ నేషనల్ లెవల్' (ఎంఆర్‌పీఎన్ఎల్) ప్రాజెక్టులో భాగంగా దేశవ్యాప్తంగా ఈ పరీక్షలు నిర్వహించారు. తెలంగాణలో మొత్తం 8,198 నమూనాలను విశ్లేషించగా.. 486 నమూనాల్లో ఎంఆర్ఎల్ కంటే అధికంగా పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు గుర్తించారు. అత్యధికంగా కర్ణాటకలో 9,176 నమూనాలను పరీక్షించగా 334లో అవశేషాలు పరిమితికి మించి ఉన్నట్లు తేలింది. మహారాష్ట్రలో 5,295 నమూనాలకు 260, గుజరాత్‌లో 6,035 నమూనాలకు 170, హరియాణాలో 2,371 నమూనాలకు 152, ఆంధ్రప్రదేశ్‌లో 2,104 నమూనాలకు 134 చొప్పున అధిక అవశేషాలు నమోదయ్యాయి.

**నమూనాల సేకరణ ఇలా..**
ఎంఆర్‌పీఎన్ఎల్ ప్రాజెక్టు కింద రిటైల్ దుకాణాలు, టోకు మార్కెట్లు, సహకార సంఘాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ) మార్కెట్లు, రైతుల పొలాల వద్ద, సేంద్రియ ఉత్పత్తుల విక్రయ కేంద్రాల నుంచి నమూనాలను సేకరిస్తున్నారు. దేశవ్యాప్తంగా 40 ప్రయోగశాలలు వీటిని పరీక్షిస్తున్నాయి. నమూనా సేకరించిన ప్రదేశానికి సంబంధించిన జీపీఎస్ వివరాలను నమోదు చేస్తున్నారు. రైతు పొలం వద్ద సేకరించిన నమూనాలైతే సాగు ప్రాంతాన్ని గుర్తించేలా ట్రేసబిలిటీని ఏర్పాటు చేశారు.


**సమగ్ర సస్యరక్షణపై అవగాహన**
రైతులు పురుగుమందులను విచక్షణారహితంగా వినియోగించకుండా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. 48 కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రాల ద్వారా రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. 2021–22 నుంచి 2025–26 వరకు 1,353 రైతు క్షేత్ర పాఠశాలలు నిర్వహించి 46,969 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. 680 రెండు రోజుల శిక్షణ కార్యక్రమాల ద్వారా 37,664 మంది, 2,384 సురక్షిత, సముచిత పురుగుమందుల వినియోగ అవగాహన కార్యక్రమాల ద్వారా 76,702 మంది రైతులు లబ్ధి పొందారు. అలాగే 2,548 విత్తన శుద్ధి కార్యక్రమాల ద్వారా 81,048 మందికి అవగాహన కల్పించారు.

**ఏఐతో పురుగు తెగుళ్ల గుర్తింపు**
కేంద్రం ఇటీవల నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్)ను అందుబాటులోకి తెచ్చింది. కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ ద్వారా పురుగు తెగుళ్లను గుర్తించడం, పర్యవేక్షించడం, నిపుణుల సలహాలు పొందడం సాధ్యమవుతుంది. సమగ్ర సస్యరక్షణలో భాగంగా బయో కంట్రోల్ ఏజెంట్లు, బయో పెస్టిసైడ్ల వినియోగానికి ప్రాధాన్యమిస్తూ.. అవసరమైనప్పుడు మాత్రమే అనుమతించిన పురుగుమందులను సూచించేలా ఈ వ్యవస్థను రూపొందించారు.

**2028–29 వరకు కొనసాగింపు**
పురుగుమందుల అవశేషాల పర్యవేక్షణ ప్రాజెక్టును 2028–29 వరకు కొనసాగించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. 21 రాష్ట్రాలు పురుగుమందుల అవశేషాల పర్యవేక్షణ, మంచి వ్యవసాయ పద్ధతులు (జీఏపీ), సమగ్ర సస్యరక్షణ అమలుకు రాష్ట్రస్థాయి కమిటీలను ఏర్పాటు చేశాయి. ఆహార ఉత్పత్తుల్లో పురుగుమందుల అవశేషాలు ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన పరిమితులను మించితే.. ఆహారం సురక్షితం కానిదిగా పరిగణిస్తామని కేంద్రం స్పష్టం చేసింది.

# పొరుగు శాంతియుత విప్లవానికి దిగాలి

**దేశంలో భారీ మార్పులు అవసరం : వాంగ్‌చుక్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (నేటి దర్శిని)**
దేశ ప్రజలు తమ రాజకీయ నేతను ఎన్నుకునే విధానంలో శాంతియుత విప్లవానికి దిగాలని, 2047 నాటికి భారత్ ఒక గౌరవప్రదమైన దేశంగా నిలవాలంటే భారీ మార్పులు అవసరమని ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయనొక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సహాయపడగల నిస్వార్థపరులు, నిర్భయులు, ఉన్నత వ్యక్తిత్వం కలిగిన స్త్రీ, పురుషుల పేర్లను సూచించాలని అన్నారు. మన దేశ ప్రగతిని పొరుగు దేశాలతో పోల్చి, దేశ ఆర్థిక స్థితిపై ఆందోళన చెందినట్టు వాంగ్‌చుక్ పేర్కొన్నారు. 50 ఏండ్ల క్రితం ఎంతో వెనుకబడిన లేదా సమానంగా ఉన్న పొరుగుదేశాలు ఇప్పుడు భారత్‌ను దాటి ఎన్నో మైళ్లు ముందుకు వెళ్లిపోయాయని శ్రీలంక, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, మలేషియా, ఇండోనేషియాలను ఉద్దేశించి పేర్కొన్నారు.

# కరెంట్‌షాక్‌పై పరిహారం కోరవచ్చు..

**-గాయపడ్డా, మరణించినా విద్యుత్తు సంస్థలదే బాధ్యత**
**సుప్రీంకోర్టు కీలక తీర్పు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (నేటి దర్శిని)**
కరెంట్ షాక్‌తో గాయపడ్డా లేదా మరణించినా పరిహారం కోరవచ్చని సుప్రీంకోర్టు శుక్రవారం కీలక తీర్పు ఇచ్చింది. కరెంట్ షాక్‌లకు విద్యుత్తు సరఫరా సంస్థలు, ప్రసార సంస్థలే బాధ్యత వహించాలని తెలిపింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ నోంగ్‌మీకపామ్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. కర్ణాటక హైకోర్టు రెండు కేసుల్లో ఇచ్చిన తీర్పులను సవాల్ చేస్తూ రాష్ట్ర పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది. అందులో మొదటి కేసు.. 2018లో కర్ణాటకకు చెందిన ఎన్ సుబ్రమణ్య అనే వ్యక్తి తన పొలంలో పనులు చేస్తుండగా అల్యూమినియం నిచ్చెన 11కేవీ వైర్లకు తాకి అతను చనిపోయాడు. అతని భార్య రూ.25,52,500 పరిహారం కోరుతూ పిటిషన్ వేయగా డివిజన్ బెంచ్ సమర్థిస్తూ తీర్పు ఇచ్చింది.

**వాహన చట్టం ప్రకారం..**
మరో కేసులో ముయిజ్ అహ్మద్ షరీఫ్ పక్కింటి మీద క్రికెట్ బాల్ తీయడానికి వెళ్లినప్పుడు 66కేవీ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి రూ.44,32,050 పరిహారం ఇవ్వాలని హైకోర్టు బెంచ్ తీర్పునిచ్చింది. ఈ రెండు కేసుల్లో జరిగిన ఘటనలు వివాదాల్లో ఉన్నాయని.. తాము డబ్బులు ఇవ్వలేమంటూ కేపీటీసీఎల్ సుప్రీంలో పిటిషన్లు వేసింది. అత్యున్నత ధర్మాసనం విచారణ సందర్భంగా.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో హైకోర్టులకు రిట్ పిటిషన్ల అధికారాన్ని వినియోగించుకోవచ్చని తెలిపింది. కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పులను సమర్థించింది.

# జైపూర్ రోడ్డుపై వ్యోమగాములు

**-గుంతల్లో నిలబడి రాకెట్, పడవలతో స్థానికుల నిరసన**
**-చంద్రుడిపై గుంతలనే మించిపోయాయంటూ ఆగ్రహం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (నేటి దర్శిని)**
బీజేపీ పాలిత రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని జోత్వారా ప్రాంతంలో రోడ్ల దుస్థితి, మురుగునీరు, డ్రైనేజీ సమస్యలపై స్థానికులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. కొందరు వ్యోమగాముల వేషధారణలో కనిపించగా, మరోవైపు ఒక రాకెట్‌ను కూడాప్రదర్శనలో భాగంగా తీసుకొచ్చారు.జోత్వారాలో అధ్వానంగా మారిన రోడ్లు, దెబ్బతిన్న డ్రైనేజీ వ్యవస్థతో విసిగిపోయిన



స్థానికులు ఈ వినూత్న నిరసనకు దిగారు. రోడ్లపై ఇప్పుడు చంద్రుడు లేదా అంగారకుడి ఉపరితలం కంటే ఎక్కువ గుంతలు ఉన్నాయని వారు ఎద్దేవా చేశారు.నిరసనకు ఉపయోగించిన రాకెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని నిరసనకారులకు చలాన్ విధించారు.

# సంపాదకీయం

## దేశవిభజన ఒక చీకటి అధ్యాయం !



స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ చంకలు గుద్దుకుంటుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో తామే పాల్గొన్నామన్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ది పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. అన్నింటికి మించి కాంగ్రెస్ చేసిన దుర్మార్గం కారణంగా దేశం రెండు ముక్కలయ్యింది. లక్షలాది మంది శవాల మీద జెండా ఎగరేశారు. ఓ రకంగా ఆగస్ట్ 14 , 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు. 1947 ఆగస్టు 14 ఉదయం. ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడుపోసుకుంటోందన్న సంబరాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్రం వీడి స్వాతంత్ర్యపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం..కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. కేవలం కంటిమీద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది. దానికి కారణం తెల్లారితే తమ ఊరు, తమ ఇల్లు ఏ దేశంలో ఉంటాయో అక్కడ ఎవరికీ తెలియని దుర్భరమైన పరిస్థితి. సరిహద్దులను నిర్ణయించే బాధ్యతను బ్రిటీష్ న్యాయవాది జాన్ రెడ్‌క్లిఫ్‌కు అప్పగించినప్పటికీ, ఆయన గీసిన ఆ వినాశకరమైన గీత ఆగస్టు 14న బయటకు రాలేదు. ఆ తుది నిర్ణయాన్ని ఆగస్టు 17 వరకు దాచిపెట్టారు. అంటే అర్ధరాత్రి రెండు దేశాలు స్వతంత్రంగా మారినప్పటికీ, వేలాది కుటుంబాలకు తమ సొంత ఇల్లు భారత్‌లో ఉందో, పాకిస్థాన్‌లో ఉందో తెలియని ఒక విచిత్రమైన, విషాదకరమైన పరిస్థితిలో7 ఉండిపోయారు. విభజన ప్రకటన ఇరు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన నింపింది. అందుకే ఆగస్టు 14 భారత దేశానికి ఒక చీకటి రోజుగా పరిగణిస్తారు. ఇది స్వాతంత్ర్యం తీసుకుని వచ్చిన దానికన్నా పెను విషాదాన్ని నింపింది. ఒక రకంగా చెప్పాలంటే 1947 ఆగస్టు 14 రాత్రి కేవలం భారత్‌ను చీల్చడానికి ఉద్దేశించిన రోజుగానే చూడాలి. దేశాలను విభజించడానికి గీసిన గీతకు ఆనాటి పెద్దలు అంగీకారం తెలపడం నేటికీ జీర్ణించుకోలేని చరిత్రగా మిగిపోతుంది. విభజనకు గీసిన ఒక గీత మధ్య అసలు మనిషి ఎక్కడ నిలబడ్డాడనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆగస్టు 14న కరాచీలో ఏం జరిగిందో చూడాలి. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింధ్ అసెంబ్లీ భవనం బయట ఉత్సాహంతో జనం కిక్కిరిసిపోయారు. మహమ్మద్ అలీ జిన్నా, లార్డ్ మౌంట్‌బాటన్ ఒకే రాచరికపు బగ్గీలో అక్కడికి చేరుకున్నారు. కరాచీలోని రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశంలో అధికార మార్పిడి పక్రియ అధికారికంగా ముగిసింది. అయితే, మౌంట్‌బాటన్‌కు అక్కడ ఎక్కువ సేపు గడిపే వ్యవధి లేదు. మధ్యాహ్నం 2 గంటలకే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఎందుకంటే అదే రోజు అర్ధరాత్రి భారత్ స్వాతంత్య వేడుకల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఇక, కరాచీలో సంబరాలు ముగిసి ఢిల్లీలో అర్ధరాత్రి వేడుకలకు వేదిక సిద్ధమవుతుంటే, పంజాబ్‌లో మాత్రం సరిహద్దు రక్తసిక్తమయ్యింది. విభజన వార్త కేవలం పత్రికలకే పరిమితం కాకుండా ప్రజల గుమ్మాల ముందుకు వచ్చింది. హిందువులు, ముస్లింలు, సిక్కులు తమ ఇళ్లను వదిలి వెళ్లాలో వద్దో తెలియక కొట్టుమిట్టాడారు. పంజాబ్‌లో రైళ్లు నడుస్తున్నాయి, కానీ అవి కేవలం ప్రయాణికులను మాత్రమే కాక, ముక్కలైన జీవితాలను మోసుకెళ్తున్నాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 మధ్య దాదాపు ఏడు లక్షల మంది శరణార్థులు రైళ్ల ద్వారా సరిహద్దులు దాటారని అంచనా. కానీ, అసలు భయానక దృశ్యం ఆగస్టు 17 తర్వాత మొదలైంది. రెడ్‌క్లిఫ్ లైన్ బహిర్గతమయ్యాక, తమ ఊరు పరాయి దేశంలోకి వెళ్లిపోయిందని తెలిసిన దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు కాలినడకన, బస్సుల్లో, రైళ్లలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని సరిహద్దులు దాటడం ప్రారంభించారు. మార్గమధ్యంలో శరణార్థుల కాఫిలాలు, రైళ్లపై దాడులు జరిగాయి. దహనమైన, నిశ్శబ్దంగా శవాల దిబ్బగా మారిన రైళ్లు స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ హింసలో 5 నుంచి 10 లక్షల మంది లేదా కొన్ని అంచనాల ప్రకారం 15 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహిళలు కిడ్నాప్‌లు, లైంగిక హింసకు గురయ్యారు. దేశమంతా ఒకవైపు పండుగ వాతావరణం, మరోవైపు రక్తపాతంతో అల్లకల్లోలంగా ఉంటే, మహాత్మా గాంధీ మాత్రం ఈ వేడుకలకు చాలా దూరంగా కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్న హైదరీ మంజిల్‌లో ఉన్నారు. కలకత్తాలో ఆగస్టు 16–18 మధ్య జరిగిన హింసలో 4,000 మందికి పైగా చనిపోయిన వేళ, గాంధీ అక్కడే ఉండి శాంతి కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. బ్రిటిష్ పాలన అధికారికంగా అంతమై, కొత్త పతాకం ఎగిరింది. కానీ, ఆ వెలుగుల వెనుక దట్టమైన చీకటి దాగి ఉంది. ఒకవైపు అధికార మార్పిడి, మరోవైపు కోట్ల మంది నిరాశ్రయుల కాళ్ల నడకలు..శాల దిబ్బలు వంటివన్నీ కళ్లముందు కదలాడాయి. జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. గాంధీ, నెహ్రూలు ప్రేక్షకపాత్ర వహించారు. మారణహోమాన్ని ఆపలేక పోయారు. ప్రజలను నడివీధుల్లో నిరాశ్రయులను చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు ఆ క్షోభ నుంచి కోలుకోలేదు. స్వాతంత్ర్యం తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న నేటి కాంగ్రెస్ నేతలు ఆనాటి మారణహోమానికి సమాధానం చెప్పగలరా? ఈ విభజన కేవలం కాంగ్రెస్ లొంగుబాటు తీరు వల్లే అని ప్రపంచానికి తెలియదా? దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో విఫలమైన ఆనాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని ఏమనాలి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి.

# ఘనంగా మహబూబ్ నగర్ లో తిరంగ ర్యాలీ





**మిడ్జిల్ ,మహబూబ్ నగర్, ఆగస్టు 14, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగ" కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో తిరంగ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ తన మనవళ్లతో కలిసి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. న్యూ టౌన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ క్లాక్ టవర్ వరకు దేశ భక్తి నినాదాలతో సాగింది. ర్యాలీతో మొత్తం మహబూబ్ నగర్ టౌన్ తిరంగ మయంగా మారింది. ఈ ర్యాలీలో విద్యార్థులు, యువకులు, వివిధ సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ... 1.స్వాతంత్ర్యాన్ని మనకు అందించిన సమరయోధులను ప్రతి ఒక్క పౌరుడు స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు.
2.భారతదేశ ఐక్యత, సమగ్రత ప్రపంచ దేశాలకు తెలిసేలా ఇంటింటిపై తిరంగ జెండాలను ఎగుర వేయాలని కోరారు. కుల, మతాలకు అతీతంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. 3."విద్యార్థులు, యువతనే దేశ భవిష్యత్" అని అన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తయ్యే సరికి "వికాసిత్ భారత్" లక్ష్యం నెరవేరేందుకు అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని, ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ఉచిత విద్యను కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. 4.భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కొన్ని దేశాలు కుట్రలు చేస్తున్నాయని, అందరం ఐక్యంగా ఉన్నామని చాటి ఆ కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని అన్నారు.ర్యాలీని విజయవంతం చేసిన విద్యార్థులు, నాయకులు, ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు,జిల్లా అధ్యక్షులు, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం

**●పటాన్‌చెరు టిడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీకి ఘన సన్మానం...**





**పటాన్ చెరు ఆగస్టు 14(నేటి దర్శిని)**
జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమం కోసం ఐక్యంగా పోరాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర, జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటిత ఉద్యమమే బలమైన మార్గమని వారు పేర్కొన్నారు.టిడబ్ల్యూజేఎఫ్ పటాన్‌చెరు డివిజన్ నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా బొల్లారంలోని కేఎస్ఎన్ బాంక్వెట్ హాల్‌లో డివిజన్ ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాదిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ సత్యం, ఇతర కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఐక్యతతోనే హక్కుల సాధన: టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్ మాట్లాడుతూ జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోగలరన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం టిడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. వృత్తి గౌరవాన్ని కాపాడుకుంటూ జర్నలిస్టుల సంక్షేమం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని అన్నారు.సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి: టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి సీలంకోటి సురేందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆరోగ్య, ప్రమాద బీమా, గృహ స్థలాలు, పెన్షన్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ ఇవ్వాలి: టిడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఏడుదొడ్ల సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, సంక్షేమ పథకాలను మరింత విస్తరించాలని కోరారు.సంఘటిత పోరాటమే మార్గం: టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటం అవసరమన్నారు. డివిజన్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమస్యలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. నూతన కమిటీ జర్నలిస్టులందరినీ కలుపుకుని పనిచేయాలని ఆకాంక్షించారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల కృష్ణ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి నాయకత్వం చొరవ తీసుకోవాలని సూచించారు.నూతన అధ్యక్షుడు బాదిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ సత్యం మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జర్నలిస్టులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రతి జర్నలిస్టుకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా, రాష్ట్ర నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తామని తెలిపారు.
టిడబ్ల్యూజేఎఫ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో చొరవ చూపిన డివిజన్ ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, చంద్రశేఖర్, రామకృష్ణలను జిల్లా, రాష్ట్ర నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. జర్నలిస్టులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘటితంగా ముందుకు తీసుకెళ్లేందుకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ డివిజన్ సలహాదారు వాసుదేవ్‌తో పాటు నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన ప్రజాసేవకుడు జరుపుల భాస్కర్ నాయక్



**మిడ్జిల్, ఆగస్టు 14, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
బాలానగర్ మండలం ఏడు గుట్టల తండా గ్రామపంచాయతీలో సర్పంచ్ రమేష్ నాయక్ తండ్రి పాత్లావత్ లాల్య నాయక్ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజాసేవకుడు జరుపుల భాస్కర్ నాయక్ వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారి కుటుంబానికి అండగా నిలిచారు. అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.20,000 ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం, కష్టాల్లో ఉన్నవారికి తోడుగా ఉండడమే నిజమైన మానవత్వమని ఈ సందర్భంగా భాస్కర్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ యువ సైన్యం నాయకులు చందు నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మిడ్జిల్, ఆగస్టు 14, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
జడ్చర్ల మండలం పోలెపల్లి గ్రామంలోని పారిశుధ్య పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రాథమిక పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా, ఆయన పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు ఇంకా ప్రారంభం కాలేదని గమనించి గుడిసెలు గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రాథమిక పాఠశాలలోని వసతులు మరియు అక్కడి పరిస్థితులను పరిశీలించి, పనులు మరియు పారిశుధ్య కార్యక్రమాలు ఎటువంటి జాప్యం లేకుండా సక్రమంగా జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

# పిఎంపాఠశాలల్లో కేంద్ర నిధులను సక్రమంగా వినియోగించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**●మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**మిడ్జిల్, ఆగస్టు 14, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్ నగర్‌జిల్లాలోని పి.ఎం. పాఠశాలలకు అందుబాటులో ఉన్న కేంద్ర నిధులను నిబంధనల ప్రకారం సక్రమంగా వినియోగించి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని పి.ఎం. పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పి.ఎం. శ్రీ పథకం ద్వారా పాఠశాలలకు అందిన నిధులను పాఠశాల అవసరాలకు అనుగుణంగా వినియోగించి, ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలిచేలా పి.ఎం. శ్రీ పాఠశాలలను అభివృద్ధి చేయాలని సూచించారు.
**ఒక వారంలోపు నిధులు పూర్తిగా వినియోగించాలి**
అందుబాటులో ఉన్న నిధులను వచ్చే వారంలోపు పూర్తిస్థాయిలో వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. పి.ఎం. శ్రీ పాఠశాలలకు నిధుల కొరత లేదని, కేవలం ఖర్చు చూపించడం కోసం కాకుండా, నిధుల వినియోగంతో పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
**ప్రాథమిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**
పాఠశాలల్లో డ్రైనేజీ, గేట్లు, తలుపులు, కిటికీలు, ఫ్యాన్లు, లైట్లు, ర్యాంపులలో చిన్నపాటి లోపాలు కూడా లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా బాలికల మరుగుదొడ్లలో తలుపులు, లైట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తరగతి గదుల్లోని అన్ని ఫ్యాన్లు పనిచేసేలా చూడాలని సూచించారు. దెబ్బతిన్న తలుపులు, కిటికీలు, ర్యాంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.
**రికార్డుల నిర్వహణ, పారదర్శకత తప్పనిసరి**
పి.ఎం. శ్రీ నిధులతో చేపట్టిన ప్రతి పనికి సంబంధించిన ఖర్చుల వివరాలను పాఠశాల రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మరమ్మతు పనులకు ముందు, పనులు పూర్తయిన తర్వాత ఫొటోలు, తేదీ, జీపీఎస్ కోఆర్డినేట్ల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఇంజినీరింగ్ పనుల ఫైళ్లలో ఫొటోలు ఉండాలని స్పష్టం చేశారు.
**స్వీయ రక్షణ శిక్షణ సమర్థవంతంగా నిర్వహించాలి**
విద్యార్థులకు అందిస్తున్న స్వీయ రక్షణ శిక్షణను కేవలం నిధుల వినియోగం కోసం నిర్వహించే కార్యక్రమంగా చూడొద్దని కలెక్టర్ అన్నారు. విద్యార్థులకు వాస్తవంగా స్వీయ రక్షణ నైపుణ్యాలు అందుతున్నాయా అని పరిశీలించి, శిక్షణా సామగ్రిని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.
**క్షేత్రస్థాయి సందర్శనలు**
త్వరలో పి.ఎం. శ్రీ పాఠశాలలను క్షేత్రస్థాయిలో సందర్శించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చే వారం నుంచి తన పర్యటనల్లో పి.ఎం. శ్రీ పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తామని, ప్రధానోపాధ్యాయులు పాఠశాల వారీగా అవసరాలను ముందుగానే గుర్తించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.
పాఠశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి, విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని, ప్రధానోపాధ్యాయులు పరస్పరం అనుభవాలు పంచుకుని ఉత్తమ పద్ధతులను అమలు చేయాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని తదితరులు పాల్గొన్నారు.

# తీదేడు అభివృద్ధే లక్ష్యం..

**●ప్రజల భాగస్వామ్యంతో ముందుకు**
**గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు**
**సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు**
**●తీదేడు సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి**



**చింతపల్లి, ఆగస్టు 14 (నేటి దర్శిని):**
తీదేడు గ్రామ సర్వతోముఖ అభివృద్ధే లక్ష్యంగా గ్రామ సభ సమావేశాన్ని నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తెలిపారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై ప్రజలతో విస్తృతంగా చర్చించి వారి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు తదితర సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు చూపేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తీదేడు గ్రామాన్ని పరిశుభ్రంగా, సుందరంగా, అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు."మన గ్రామం.. మన బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య, వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణగౌడ్, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్, సందె లక్ష్మయ్య, మర్ల యాదగిరి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమావత్ కిరణ్ కుమార్, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.'

# దాడులు చేస్తాం.. కేసులు పెడతాం...

- మా ప్రభుత్వం మా ఇష్టమంటూ రెచ్చిపోయిన కాంగ్రెస్ నేత...
- కల్తీ ఆహారంపై సమాచారం ఇచ్చిన వారిపైనే కేసులా?
- మహిళా జర్నలిస్టుపై దురుసు ప్రవర్తనపై విచారణ ఏదీ?
- వీడియో ఆధారాలున్నా చర్యలు ఎందుకు ఆలస్యం?
- జర్నలిస్టులపై కేసుల వెనుక ఎవరి హస్తం?
- ఆత్మరక్షణ కొరకు ఏమైనా చేయొచ్చు అంటూ సమర్థించిన పోలీసు యంత్రాంగం..?
- డీజీపీ, సీపీ నిష్పక్షపాత విచారణకు డిమాండ్


ఆటోలో పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం


మహిళా జర్నలిస్టుపై దాడికి తెగపడ్డ దృశ్యం


మహిళ జర్నలిస్టు నుండి దౌర్జన్యంగా ఫోన్ లాక్కున్న దృశ్యం


జర్నలిస్టుపై దాడి చేస్తున్న దృశ్యం

**హైదరాబాద్, ఆగస్టు 14 (నేటి దర్శిని):** కల్తీ ఆహార పదార్థాల తయారీ, ప్యాకింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హబ్సిగూడ స్ట్రీట్ నంబర్--8, బృందావన్ కాలనీ రోడ్ నంబర్--2లో రోడ్డుపై పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్నారన్న సమాచారాన్ని అధికారులకు చేరవేసిన జర్నలిస్టులపైనే కేసులు నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది.

**దాడి చేసింది ఎవరు?**

పన్నీర్ ప్యాకింగ్‌కు సంబంధించిన సమాచారం అందడంతో జర్నలిస్టులు సంఘటనా స్థలానికి చేరుకుని ఫొటోలు, వీడియోలు తీసిన అనంతరం పోలీసు, ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించినట్లు వారు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వచ్చే వరకు అక్కడే కొంత దూరంలో వేచి ఉన్న సమయంలో కొందరు వ్యక్తులు తమపై దాడికి పాల్పడ్డారని జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల్లో జర్నలిస్టులతో వాగ్వాదం, దురుసు ప్రవర్తన, తోపులాట వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. మహిళా జర్నలిస్టుపై కూడా దురుసుగా ప్రవర్తించి, ఆమె ఫోన్ లాక్కున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఘటనలో అసలు దాడికి పాల్పడింది ఎవరు? ఎవరిని ఎవరు బెదిరించారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి.

**కల్తీపై సమాచారం ఇవ్వడమే నేరమా?**

ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే కల్తీ ఆహార వ్యవహారాలపై అధికారులకు సమాచారం అందించడం జర్నలిస్టుల సామాజిక బాధ్యతలో భాగమేనని జర్నలిస్టులు చెబుతున్నారు. పన్నీర్ వంటి ఆహార పదార్థాలను నిబంధనలకు విరుద్ధంగా ప్యాకింగ్ చేస్తున్నారన్న సమాచారం అందినప్పుడు దానిపై పరిశీలన చేయాల్సిన బాధ్యత ఫుడ్ సేఫ్టీ అధికారులదేనని, సమాచారం అందిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసులదేనని వారు పేర్కొంటున్నారు. అయితే సమాచారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన జర్నలిస్టులపైనే కేసులు నమోదు కావడం వల్ల భవిష్యత్తులో ప్రజా సమస్యలు, అక్రమాలు, కల్తీ వ్యవహారాలను వెలుగులోకి తీసుకురావడానికి జర్నలిస్టులు వెనుకడుగు వేసే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**వీడియో ఆధారాలను పరిశీలించాలి**

ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న నేపథ్యంలో వాటిని సమగ్రంగా పరిశీలించి, సంఘటనా స్థలంలో జరిగిన వాస్తవాలను పోలీసులు నిర్ధారించాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, వీడియో ఆధారాలు, ఇరుపక్షాల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరుతున్నాయి. జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడానికి ముందు దాడి, బెదిరింపులు, దురుసు ప్రవర్తనకు సంబంధించిన ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరగాల్సి ఉందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళా జర్నలిస్టుపై జరిగినట్లు ఆరోపిస్తున్న ఘటనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

**డీజీపీ, సీపీ స్పందించాలి**

ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ నగర సీపీ ప్రత్యేక దృష్టి సారించి నిష్పక్షపాత విచారణకు ఆదేశించాలని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి. కల్తీ ఆహారంపై సమాచారం ఇచ్చే వారిని ప్రోత్సహించాల్సిన సమయంలో, వారే కేసులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడితే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ఆరోగ్యానికి సంబంధించిన అంశాలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిజం బాధ్యతలో భాగమని, అదే సమయంలో ప్రతి ఘటనలోనూ చట్టపరమైన పరిమితులను గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ.. ఈ వ్యవహారంలో నిజానిజాలను ఆధారాలతో తేల్చి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**కల్తీపై పోరాటం చేసేవారికి రక్షణ కావాలి**

**అక్రమాలు, కల్తీ వ్యవహారాలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దాడికి పాల్పడింది ఎవరు? మహిళా జర్నలిస్టుపై దురుసుగా ప్రవర్తించింది ఎవరు? జర్నలిస్టులపై కేసులు ఏ ఆధారాలతో నమోదయ్యాయి? అనే ప్రశ్నలకు నిష్పక్షపాత విచారణ ద్వారానే సమాధానం లభించాలి. వీడియో ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి.**

# మిడ్జిల్ మండల కాంగ్రెస్ నాయకుల తీరు పై పలువురి కార్యకర్తల అసంతృప్తి

- కాంగ్రెస్ లో అసలు అసంతృప్తి జ్వాలలు
- కార్యకర్తలను సమన్వయం చేయడంలో మండల పార్టీ నాయకులు విఫలం!
- కొంతమందికే ప్రాధాన్యతనిస్తున్నారంటూ ఆరోపణలు.
- ఈ అంశంపై పార్టీ అధినాయకత్వం ఆలోచించాలని కార్యకర్తల అభిప్రాయం.



**మిడ్జిల్, ఆగస్టు 14, నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో /** మిడ్జిల్ మండలంలో కాంగ్రెస్ పార్టీలో ఇటీవల కార్యకర్తల మధ్య కొంత అసంతృప్తి పెరుగుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మిడ్జిల్‌మండల నాయకుల పనితీరుపై పలువురు కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.కార్యకర్తల అభిప్రాయం ప్రకారం, ఎమ్మెల్యే ఎక్కడ కార్యక్రమాలకు హాజరైతే మిడ్జిల్ మండల నాయకులు
అక్కడే ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ, మండల స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో తగినంత శ్రద్ధ చూపడం లేదని వారు పేర్కొంటున్నారు.అదేవిధంగా, పార్టీ బలోపేతానికి సంబంధించి తీసుకునే కొన్ని నిర్ణయాల్లో అందరికీ సమాన ప్రాధాన్యం దక్కడం లేదని, కొందరికి మాత్రమే అధిక ప్రాధాన్యం ఇస్తూ, మరికొందరిని దూరంగా ఉంచుతున్నారనే అభిప్రాయం కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది.దీంతో కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన పలువురు కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతున్నారనే చర్చ సాగుతుంది.పార్టీ మరింత బలోపేతం కావాలంటే ప్రతి కార్యకర్తను సమానంగా గౌరవించి, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లే విధానాన్ని అవలంబించాలని కార్యకర్తలు కోరుతున్నారు.

# జ్ఞనధార పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్




**మిడ్జిల్, ఆగస్టు 14, (నేటి దర్శని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థుల ప్రతిభ ను గుర్తించడానికి కార్యదర్శి గురుకుల హైదరాబాద్ విద్యార్థుల ద్వారా కథలు,డ్రాయింగ్స్,కవితలు నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలతో ముద్రించిన జ్ఞనధార పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో తన ఛాంబర్ లో ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఆర్.సి. ఓ కళ్యాణి తదితరులు ఉన్నారు

బిజినెస్

# నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఉదయం నష్టాలతో ప్రారంభమైన సూచీలు రోజంతా ఒడిదుడుకుల మధ్య కొనసాగి, చివరకు ఎరుపు రంగులోనే స్థిరపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 70.71 పాయింట్లు, 0.09 శాతం నష్టపోయి 78,009.25 వద్ద ముగిసింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 29.85 పాయింట్లు, 0.12 శాతం క్షీణించి 24,366.00 వద్ద స్థిరపడింది. మార్కెట్‌లో ఎంపిక చేసిన భారీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించడం సూచీలపై ప్రభావం చూపింది. సెన్సెక్స్‌లో ఏషియన్ పెయింట్స్, ఇండిగో, ఎన్టీపీసీ తదితర షేర్లు నష్టాలతో ముగియగా, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్ వంటి షేర్లు లాభాలను నమోదు చేశాయి. దీంతో సూచీలు పెద్దగా పతనం కాకపోయినా, రోజంతా ప్రతికూల ధోరణి కొనసాగింది. విదేశీ మారక మార్కెట్‌లోనూ రూపాయిపై ఒత్తిడి కొనసాగింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.43గా నమోదైంది. దిగుమతుల వ్యయం, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు వంటి అంశాలు రూపాయి కదలికలపై ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కూడా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 87 డాలర్ల వద్ద కొనసాగుతోంది. చమురు ధరల్లో మార్పులు భారత్ వంటి చమురు దిగుమతి ఆధారిత దేశాల ద్రవ్యోల్బణం, వాణిజ్య లోటు, రూపాయి విలువతో పాటు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. మొత్తంగా, దేశీయ మార్కెట్లు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిసినప్పటికీ, సూచీల పతనం పరిమితంగానే ఉంది. రాబోయే సెషన్లలో అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, ముడి చమురు ధరలు, రూపాయి మారకం విలువ, విదేశీ పెట్టుబడుల ప్రవాహం వంటి అంశాలు మార్కెట్ దిశను నిర్ణయించడంలో కీలకంగా మారనున్నాయి.

# తగ్గిన బంగారం ధరలు



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, డాలర్ మారకం విలువలో మార్పులు వంటి అంశాల ప్రభావంతో దేశీయంగా పసిడి ధరల్లో కదలికలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ.710 తగ్గి రూ.1,52,890కు చేరింది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర కూడా తగ్గింది. 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.650 తగ్గి రూ.1,40,150 వద్ద నమోదైంది. ఇక వెండి ధరలో మాత్రం శుక్రవారం ఎలాంటి మార్పు కనిపించలేదు. గత ధర వద్దనే వెండి కొనసాగింది. బంగారం ధరలు తగ్గినప్పటికీ, వెండి ధర స్థిరంగా ఉండటం మార్కెట్‌లో మిశ్రమ పరిస్థితులను సూచిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్ తదితర నగరాల్లో స్థానిక పన్నులు, నగల తయారీ ఛార్జీలు, డిమాండ్ వంటి కారణాలతో బంగారం ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉంది. అలాగే ఆభరణాలు కొనుగోలు చేసే సమయంలో ప్రకటించిన బంగారం ధరకు అదనంగా మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ వంటి ఇతర ఖర్చులు వర్తించవచ్చు. పసిడి ధరలు రోజువారీగా మారే అవకాశం ఉన్నందున కొనుగోలుదారులు ఆభరణాలు లేదా బంగారం కొనుగోలు చేసే ముందు స్థానిక బులియన్ మార్కెట్‌లో తాజా ధరలను నిర్ధారించుకోవడం మంచిది.

# రూ.5 వేలు తగ్గిన కేజీ వెండి ధర




హైదరాబాద్‌లో బంగారం, వెండి ధరలు శుక్రవారం గణనీయంగా తగ్గాయి. ముఖ్యంగా వెండి ధరలో భారీ క్షీణత నమోదైంది. కేజీ వెండి ధర రూ.5,000 తగ్గి రూ.2.55 లక్షలకు చేరింది. వెండి ధర తగ్గడంతో కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట లభించింది. బంగారం ధరల్లోనూ తగ్గుదల నమోదైంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.710 తగ్గి రూ.1,52,890కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా తగ్గి రూ.1,40,150 వద్ద నమోదైంది. ఇటీవల బంగారం, వెండి ధరల్లో చోటుచేసుకుంటున్న హెచ్చుతగ్గులు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలపై ఆధారపడి ఉన్నాయి. డాలర్ మారకం విలువ, అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లలో ధరల కదలికలు, పెట్టుబడిదారుల డిమాండ్ వంటి అంశాలు విలువైన లోహాల ధరలను ప్రభావితం చేస్తుంటాయి. హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ఇతర నగరాల్లో స్థానిక మార్కెట్ పరిస్థితులు, పన్నులు, డిమాండ్ తదితర కారణాలతో ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండవచ్చు. ఆభరణాల కొనుగోలు సమయంలో బంగారం ధరతో పాటు మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ వంటి అదనపు ఖర్చులు కూడా వర్తిస్తాయి. మొత్తంగా బంగారం, వెండి ధరలు ఒకే రోజులో తగ్గడంతో కొనుగోలుదారులకు కొంత ఉపశమనం లభించింది. అయితే రాబోయే రోజుల్లో ధరలు ఏ దిశగా కదులుతాయన్నది అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

# కామెంటేటర్‌గా రహానే..
## భారత్, శ్రీలంక సిరీస్‌తో అరంగేట్రం..!




అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్యా రహానే కొత్త అవకాశాలతో బిజీ అవుతున్నాడు. ఇప్పటికే యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ లో ఆడేందుకు సిద్ధమైన రహానే.. త్వరలోనే కామెంటేటర్‌గానూ అవతారం ఎత్తనున్నాడు. ఇన్నాళ్లు మైదానంలో తన మార్క్ ఆటతో అలరించిన అతడు.. ఇకపై మాటల హోరుతో అభిమానులతో టచ్‌లో ఉండనున్నాడు. భారత్, శ్రీలంక టెస్టు సిరీస్‌తోనే ఈ మాజీ కెప్టెన్ కొత్త ఇన్నింగ్స్ మొదలవ్వనుంది. రిటైర్మెంట్ అనంతరం శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాడు అజింక్యా రహానే. భారత జట్టును వీడినప్పటికీ క్రికెట్‌తోనే కొనసాగాలని భావించిన అతడు.. కామెంటేటర్‌గా రాణించాలని ఆశిస్న?న్నాడు. అది కూడా భారత్, శ్రీలంక టెస్టు సిరీస్‌తోనే కామెంటరీ బాక్స్‌లో రహానే సందడి చేయనున్నాడు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ కామెంటరీ ప్యానెల్‌లో చోటు దక్కించుకున్న మాజీ కెప్టెన్.. టీమిండియా ఆరొందల టెస్టు మ్యాచ్‌లో వ్యాఖ్యాతగా అరంగేట్రం చేయనున్నాడు. ‘రహానే మ్యాజిక్ ఆగిపోలేదు. కొత్త ఇంటిని వెతుక్కుంది. ఎక్స్‌ట్రా ఇన్నింగ్స్‌లోకి స్వాగతం జింక్స్’ అని రహానేకు తమ కామెంటరీ బోర్డులోకి ఆహ్వానించింది సోనీ స్పోర్ట్స్. తన సుదీర్ఘ కెరీర్‌లో రహానే టీమిండియా తరపున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20లు ఆడాడు. భారత జట్టుకు సారథిగా, వైస్ కెప్టెన్‌గా.. మిడిలార్డర్ బ్యాటర్‌గా విశేష సేవలందించిన అతడికి బీసీసీఐ ‘ఫిక్స్‌డ్ పింఛన్’ ఇవ్వనున్న విషయం తెలిసిందే. ఇకనుంచి నెలనెలా రూ.70 వేలు పింఛను రూపంలో రహానే అందుకోనున్నాడని బీసీసీఐ ధ్రువీకరించింది.

# సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్ అతడే: అశ్విన్

**సీఎస్‌కే కోచ్‌గా ఇయాన్ మోర్గాన్**

**అంచనా వేసిన రవిచంద్రన్ అశ్విన్**

**ధోనీ మళ్లీ కెప్టెన్ అవ్వాలని సూచన**




ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ప్రస్తుతం కొత్త హెడ్ కోచ్ వేటలో ఉంది. సుదీర్ఘకాలం పాటు సీఎస్‌కేకు సేవలు అందించిన హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ బాధ్యతల నుంచి వైదొలగడంతో అతడి స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారనే దానిపై తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో 2019లో తన సారథ్యంలో ఇంగ్లాండ్‌కు వన్డే ప్రపంచకప్ అందించిన మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ పేరు రేసులో ముందంజలో ఉన్నట్లు సమాచారం. ఈ అంశంపై భారత మాజీ స్పిన్నర్, సీఎస్‌కే మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో కీలక వ్యాఖ్యలు చేశాడు. సీఎస్‌కే కొత్త కోచ్‌గా ఇయాన్ మోర్గాన్ వచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అశ్విన్ చెప్పాడు. ఇప్పటికే దీనిపై ఫ్రాంచైజీ చర్చలు జరిపినట్లు తెలుస్తోందని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెక్‌కల్లమ్ పేరు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ, సీఎస్‌కే మేనేజ్‌మెంట్ మాత్రం మోర్గాన్ వైపే ఎక్కువగా మొగ్గు చూపుతోందని యాష్ అభిప్రాయపడ్డాడు. కోచ్ మార్పుతో పాటు సీఎస్‌కే జట్టు నాయకత్వంపై కూడా అశ్విన్ సూచనలు చేశాడు. గత రెండు సీజన్లలో పేలవ ప్రదర్శన చేసిన సీఎస్‌కే ప్రస్తుతం కష్టకాలంలో ఉందని, ఇలాంటి సమయంలో ఎంఎస్ ధోనీ కనీసం ఒక్క ఏడాదైనా మళ్లీ కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. పరిస్థితులు నిలకడగా మారే వరకు ధోనీ ముందుండి నడిపిస్తే కొత్త కోచ్‌కు కూడా సెట్ అవ్వడానికి సమయం దొరుకుతుందని, టీమ్ అంతా కలిసికట్టుగా ఉంటుందని అశ్విన్ పేర్కొన్నాడు. కాగా, గత ఐపీఎల్ సీజన్‌లో ధోనీ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. దానికి తోడు వరుసగా రెండు సీజన్లలో చెన్నై సూపర్ కింగ్స్.. దారుణ ప్రదర్శన చేయడం అభిమానులను కలవరపెడుతోంది. ఐపీఎల్ 2026 సీజన్‌పై మేనేజ్‌మెంట్ సమీక్ష నిర్వహించి.. కోచ్, ఆటగాళ్ల ట్రేడ్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇందుకోసం మరికొంత సమయం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి.


స్పోర్ట్స్

# ఆసీస్ గడ్డపై చరిత్ర సృష్టించిన తంజిద్ హసన్..

**తంజిద్ చారిత్రక టెస్ట్ సెంచరీ**

**ఆసీస్‌కు బంగ్లాదేశ్ బిగ్ షాక్**

**డార్విన్ టెస్టులో బంగ్లా ఆధిక్యం**



ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ అదరగొడుతోంది. తొలుత బౌలింగ్‌లో సత్తాచాటిన ఆ జట్టు.. ఇప్పుడు బ్యాటింగ్‌లోనూ సవాస్ విసురుతోంది. ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లాండ్ లాంటి మేటి జట్లు ఇబ్బంది పడ్డా.. బంగ్లాదేశ్ మాత్రం సత్తాచాటుతోంది. డార్విన్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో తిరుగులేని ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాను 198 పరుగులకే కుప్పకూల్చింది బంగ్లాదేశ్. అనంతరం తంజిద్ హసన్ తమీమ్ సెంచరీతో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బంగ్లాదేశ్ 65.3 ఓవర్లలో 231/3తో నిలిచింది. ఆ జట్టు ప్రస్తుతం 33 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఓవర్ నైట్ స్కోరు 96/1తో రెండో రోజు ఆట ప్రారంభించిన బంగ్లాదేశ్.. కాసేపటికే వికెట్ కోల్పోయింది. మోమినుల్ హక్ (49).. జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన నజ్ముల్ హొస్సేన్ శాంటో.. తంజిద్ హసన్ తమీమ్‌కు జత కలిశాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 93 పరుగులు జోడించారు. సెంచరీ చేసిన కాసేపటికే తంజిద్ ఔట్ అయ్యాడు. ఈ క్రమంలోనే తంజిద్ హసన్.. సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ సిరీస్‌లో తొలి శతకాన్ని నమోదు చేశాడు. 188 బంతుల్లో అతడు ఈ ఫీట్ సాధించాడు. టెస్టుల్లో అతడికి ఇదే తొలి సెంచరీ కావడం విశేషం. అంతేకాకుండా ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గానూ తంజిమ్ చరిత్ర సృష్టించాడు. మొత్తంగా బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా టెస్టుల్లో సెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా తంజిద్ నిలిచాడు. 2006లో షహ్రియార్ నఫీజ్ తొలి సెంచరీ కొట్టాడు. తంజిద్ హసన్ సెంచరీ , నజ్ముల్ హోస్సేన్ షాంటో హాఫ్ సెంచరీతో ప్రస్తుతం బంగ్లాదేశ్ ఈ టెస్టులో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. తంజిద్ హసన్ (101) ఔట్ అయ్యే సమయానికి బంగ్లాదేశ్ 65.3 ఓవర్లలో 231/3తో నిలిచింది. 33 పరుగులు ఆధిక్యంలో ఉంది. చేతిలో 7 వికెట్లు ఉన్న బంగ్లా.. భారీ స్కోరు చేస్తే ఈ మ్యాచ్‌పై మరింత పట్టు సాధించే అవకాశం ఉంది.

# ఏడేళ్ల తర్వాత డీపీ మార్చిన ప్రభాస్.. ఫౌజీ లుక్‌తో వైరల్!



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ప్రస్తుతం ఆయన 'ఫౌజీ' చిత్ర షూటింగ్‌లో పాల్గొంటున్న విషయం తెలిసిందే. ఎలాంటి విరామం లేకుండా అటు తరువాత 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో కూడా పాల్గొననున్నారు. అయితే తన సినిమాలతో పాటు కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడంలో, తోటి నటులకు మద్దతుగా నిలవడంలో ప్రభాస్ ఎప్పుడూ ముందుంటారు. ఈ నేపథ్యంలోనే ఆయన సోషల్ మీడియా ఖాతాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రభాస్ తన ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ పిక్చర్ (డీపీ)ను మార్చారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఫౌజీ'కి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తన కొత్త డీపీగా సెట్ చేశారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో మేకర్స్ నుంచి త్వరలోనే మరిన్ని కీలక అప్‌డేట్లు రానున్నాయి. ముఖ్యంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ సినిమా నుంచి అదిరిపోయే అప్‌డేట్ వస్తుందని అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా, పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా,

# లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డిగా వెంకటేష్..

## -అనిల్ రావిపూడి మూవీ నుంచి పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్!




టాలీవుడ్ లో మోస్ట్ అవేటెడ్ కాంబినేషన్లలో ఒకటైన విక్టరీ వెంకటేష్ మరియు సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కలయికలో వస్తున్న తాజా చిత్రంపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా రిలీజ్ చేయగా, సోషల్ మీడియాలో ప్రస్తుతం ఇది తెగ వైరల్ అవుతోంది.ఈ పోస్టర్ ద్వారా సినిమాలోని హీరో పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను చిత్ర యూనిట్ పరిచయం చేసింది. ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ 'లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి' అనే పవర్ ఫుల్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇండియన్ ఆర్మీకి చెందిన కౌంటర్-టెర్రరిజం మరియు హోస్టేజ్ నెగోషియేషన్ విభాగంలో స్పెషలైజేషన్ కలిగిన ఆర్మీ ఆఫీసర్‌గా ఈ పాత్ర అత్యంత కీలకంగా ఉండనుంది. విడుదలైన పోస్టర్‌లో విక్టరీ వెంకటేష్ పూర్తి ఆర్మీ కమోఫ్లాజ్ యూనిఫామ్, బ్లాక్ కంబాట్ బూట్స్, సన్‌గ్లాసెస్ ధరించి చాలా ఇంటెన్స్‌గా కనిపిస్తున్నారు. ఒక విలాసవంతమైన బ్లాక్ కలర్ మెర్సిడెస్-బెంజ్ జి-క్లాస్ (జి-వ్యాగన్) కారు బంపర్పై కాలు పెట్టి, ఎంతో గంభీరంగా నిలబడి ఉన్న భంగిమ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. వెనుకవైపు యుద్ధ వాతావరణాన్ని తలపించేలా మేఘావృతమైన ఆకాశం, ఎగురుతున్న మిలటరీ హెలికాప్టర్లు, మరియు కింద ఎగురుతున్న దుమ్ము, నిప్పు రవ్వల ఎఫెక్ట్స్ సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేస్తున్నాయి. శ్రీమతి అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ మరియు జెడ్ స్టూడియోస్ పతాకాలపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కాగా, ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. దేశభక్తి, హై-వోల్టేజ్ యాక్షన్ మరియు పూర్తి కమర్షియల్ హంగులతో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త సినిమా అనుభూతిని పంచడం ఖాయమని ఫస్ట్ లుక్ చూస్తే స్పష్టమవుతోంది.

# విషపూరిత బంధాన్ని తెంచుకున్నా

వ్యక్తిగత విషయాలను ఎక్కువశాతం చాలామంది గోప్యంగానే ఉంచుతారు. బహిర్గతం చేసుకోరు. కానీ అందుకు భిన్నమైన వ్యక్తిత్వం నటి అనుపమ పరమేశ్వరన్‌ది. తన అనుభవాలు ఇతరులకు హెచ్చరికలా ఉండాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నిర్మొహమాటంగా మనసును ఆవిష్కరించారామె. 'ప్రేమ పేరుతో ఓ వ్యక్తి కొన్నేళ్ల క్రితం నా జీవితంలోకి వచ్చాడు. పరిచయమైన మూడు నెలలకే నిశ్చితార్థం, వివాహం అంటూ బలవంతపెట్టడం మొదలుపెట్టాడు. ఆ తొందరపాటులో ప్రేమకంటే నన్ను నియంత్రించాలనే ఆత్రమే ఎక్కువ కనిపించేది.నేను ధరించే దుస్తులు, సోషల్ మీడియాలో నేను పెట్టే పోస్టులు, చివరికి నేను ఎంచుకునే సినిమాల విషయంలో కూడా ఆంక్షలు విధించడం మొదలుపెట్టాడు. అసలు నటనకే నన్ను దూరం చేయాలని చూశాడు. దాంతో స్వేచ్ఛకు దూరమై మానసికంగా నలిగిపోయాను. కేరవాన్‌లో ఒంటరిగా కూర్చొని ఏడ్చేదాన్ని. ఒక్కోసారి అతని ప్రవర్తన భయం కలిగించేది. ఈ ఆందోళన వల్ల బరువు తగ్గిపోయాను. నా కెరీర్‌లోనే అతి పెద్ద విజయమైన 'డ్రాగన్' సినిమా ప్రమోషన్స్‌కి నేను హాజరు కాకపోవడానికి కారణం కూడా అతనే. అందుకే ఆ విషపూరిత బంధాన్ని అతికష్టం మీద తెంచుకున్నా. ప్రస్తుతం ఆ మానసిక గాయం నుంచి కోలుకునే పనిలో ఉన్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది అనుపమ. అయితే ఆ వ్యక్తి ఎవరో మాత్రం ఆమె వెల్లడించలేదు. అగ్రహీరో విక్రమ్ తనయుడు ధృవ్‌తో ఆమె కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నట్టు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఈ ఇంటర్వ్యూలో అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.




# టాక్సిస్ కోసం కియారా చాలా కష్టపడింది

## నటుడు యశ్ ప్రశంసలు




సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# విశ్రాంతిని ఎంజాయ్ చేస్తున్న రష్మిక



టాలీవుడ్ ప్రముఖ నటి రష్మికా మందన్నా ప్రస్తుతం గాయం కారణంగా సినిమాలకు దూరంగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ రెస్ట్ సమయంలో తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఎప్పుడూ తీరిక లేకుండా ఉరుకులు పరుగులతో బిజీగా గడిపేవారికి, ఒక్కసారిగా పనులు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం మొదట్లో చాలా భయంగా అనిపిస్తుందని రష్మిక తెలిపారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో అలా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తే.. గతంలో అలా పిచ్చివాళ్లలా పనుల వెనకే పరిగెత్తిన దినాలు ఇప్పుడు తలచుకుంటే మరింత భయంగా అనిపిస్తాయని, బహుశా జీవితం అంటే ఇదేమో అని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అలారాలు పెట్టుకోకుండా శరీరం కోరిన సమయానికి లేవడం, రోజుకు రెండు పూటల మితంగా భోజనం చేయడం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, ఇష్టమైన షోలు చూడటంతో పాటు పాత ఫోటోలు, వీడియోలను నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతున్నానని చెప్పారు. ఈ కష్టకాలంలో తాను త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ అభిమానులు, శ్రేయోభిలాషులు పంపిస్తున్న ప్రార్థనలకు, చూపుతున్న ప్రేమానురాగాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్ర షూటింగ్‌లో భాగంగా ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా రష్మిక తుంటి భాగంలో గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆమె కొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365